క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని నాగవరంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, శ్రీను, వెంకట్ తదితరులు అభయాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

బంగ్లా పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో ఆదివారం బంగ్లా పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. 60 సంవత్సరాల క్రితం నిర్మించిన బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ మొత్తంతో బంగ్లా పునర్నిర్మాణానికి పెద్దలంతా భూమిపూజ చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, చదరం భాస్కరరావు, పాలమరశెట్టి మురళి, రాపేటి పరమేష్, నరేంద్ర, ఆళ్ల వెంకటేష్, బీ గణేష్, ఎంవీఆర్ నాయుడు, సూరప్పారావు,దాడి అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మతల్లి జాతర



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కోటవురట్ల: రామచంద్రపాలెంలో గంగాలమ్మ తల్లి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో పోటెత్తింది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నసమారాధన నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కన్నబాబు, మాజీ సర్పంచ్ నంబారు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా గోవిందు

ఎస్.రాయవరం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఉమ్మిడి గోవింద్ నియమితులయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా నాయకుల సూచన మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన గోవిందును నియమించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ జిల్లా, మండల నాయకులు అభినందించారు.

మంగళాపురంలో మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం



మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో మోదకొండమ్మ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి గ్రామ శివారులో లక్షలాది రూపాయలతో మోదకొండమ్మ ఆలయంను నిర్మించారు. ఆదివారం వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా పురోహితుల సమక్షంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ప్రత్యేక కుంకుమ పూజలు, వ్రతాలు, హోమాలు చేశారు. కుముదాంపేట, విజయరామరాజుపేట, మంగళాపురం, అప్పలరాజుపురం, సురవరం, తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేవారు. కోలాటం పోటీల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. రాత్రికి పలు భజన బృంద సభ్యులు భక్తి గీతాలు పాడి అలరించారు. సర్పంచ్ కంటే వెంకట్ పద్మరేఖ, పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దాహం తీర్చని చలివేంద్రాలు

- నీళ్లు లేని కుండలు దర్శనం
- దాహార్తితో అల్లాడుతున్న జనం
- పట్టించుకోని పాలకులు

యలమంచిలి రూరల్: ఒకవైపు సూర్య ప్రతాపంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పట్టణానికి వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజానీకం తమ దాహార్తి తీర్చే దిక్కెవరంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎక్కడా తాగునీరు అందుబాటులో ఉంచడంలేదు. దీంతో గొంతెండితే వాటర్ బాటిళ్లు కొనుక్కోక తప్పని పరిస్థితి ఉందని వాపోతున్నారు. జనసమర్థం ఉన్న యలమంచిలి పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో గత నెలలో రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. **వేలాది మంది ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే యలమంచిలి పట్టణంలో స్థానిక పురపాలక సంఘ కార్యాలయం, అన్న క్యాంటీన్ వద్ద మాత్రమే మున్సిపల్ అధికారులు వీటిని ఏర్పాటు చేశారు.** అన్న క్యాంటీన్ వద్ద చలివేంద్రంలో అరకొరగా తాగునీరు అందుబాటులో ఉంటోంది. రోజూ క్రమం తప్పకుండా ఇక్కడ తాగునీటిని ఏర్పాటు చేయడంలేదు. రైల్వే స్టేషన్ రోడ్డులో శ్రీరామా గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం స్వచ్ఛందంగా ఒక చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీని నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంటోంది. ఇవి తప్ప ఇంకెక్కడా చలివేంద్రాలు కనిపించడంలేదు. గతంలో పలు స్వచ్ఛంద సంస్థలు, ధనవంతులు, సామాజిక స్పృహ ఉన్న వారు వేసవిలో చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసేవారు. కొందరైతే మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇక్కడ కాకుండా ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ కూడలి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తే ఎక్కువమందికి ఉపయోగపడే అవకాశం ఉంది.



అన్న క్యాంటీన్ వద్ద చలివేంద్రంలో నీరులేని కుండలు

తాగేందుకు నీరు దొరకడంలేదు



వేసవి తీవ్రతతో పట్టణంలో తాగేందుకు నీరు దొరకని పరిస్థితి ఉంది. నేను రోజువారీగా చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుంటాను. ఎండలోనే ఎక్కువసేపు ఉంటాను. అలాంటి సమయంలో దప్పికగా ఉన్నప్పుడు తాగునీరు కొనుగోలు చేయాల్సిందే. చేతి బోర్లు అందుబాటులో లేవు.

– బంగారి దేముడు, చిరు వ్యాపారి

వృద్ధులు, మహిళలకు ఇబ్బందులు



మధ్యాహ్న సమయాల్లో వడదెబ్బకు గురి కాకుండా చూసుకుందామంటే గ్లాసు మంచి నీరు అందుబాటులో ఉండడం లేదు. ముఖ్యంగా పట్టణానికి వచ్చే వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. బిచ్చగాళ్లు, పేద వారు వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది.

యల్లపు శ్రీనువాసరావు, సోమలింగపాలెం

వెద సాగుతో తక్కువ ఖర్చు



సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

కోటవురట్ల: వరిలో వెద సాగుతో ఖర్చు తగ్గుతుందని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని సుంకపూరు, బోడపాలెం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి సాగులో యాంత్రీకరణ చేపట్టడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి బి.సరోజిని మాట్లాడుతూ వరి నూతన వంగడాలు ఎంటీయూ 1224, ఎంటీయూ 1262, ఎంటీయూ 1318 రకాలతో అధిక దిగుబడులు సాధ్యపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తూ పీఎండీఎస్ కిట్లు రూపంలో విత్తనాలను అందిస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తు నాటిన నుంచి కోత వరకు యంత్రాలను వినియోగించడం ద్వారా ఖర్చు తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, వ్యవసాయ సహాయకులు త్రినాథ్, నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండగ



సత్తెమ్మతల్లి పండగ ఊరేగింపులో దళితవాసులు

మునగపాక: స్థానిక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మహిళలు, దళితవాడ వాసులంతా ఊరేగింపుగా డప్పు, వాయిద్యాలతో ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, డొక్కా నాగభూషణం, పిల్లి అప్పారావు, కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల నూకరాజు, బీలా అప్పలనాయుడు, కరణం గణేష్, దిమ్మల శివ, బీలా లక్ష్మణరావు, రాజు, శివ గణేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీహరిరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలకు అనుగుణంగా సాగు చేపట్టాలని శాస్త్రవేత్త శ్రీహరిరావు కోరారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అరబుపాలెం, చెర్లోపాలెం గ్రామాల్లో ఆదివారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, అనకాపల్లి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సాగులో యూరియా వినియోగం తగ్గించాలని ఆయన తెలిపారు. మోతాదుకు మించి ఎరువులను వాడితే ప్రయోజనం ఉండదన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేపట్టాలన్నారు. పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి మాట్లాడుతూ పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవన ఎరువులు, పశువుల గెత్తం వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సత్యవతి, వ్యవసాయ సహాయకులు పవన్, ఉద్యానవన శాఖ అధికారి ప్రవీణ, శరగడం యోగి నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక



విద్యాసాగర్ గన్నెమ్మ గాయత్రి



జయకృష్ణ వంశీ నాగస్వాతి వైష్ణవి

నక్కపల్లి: మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారని ఎంఈవో కుంచం నరేష్ తెలిపారు. వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొయ్య విద్యాసాగర్ (588), పోతంశెట్టి గన్నెమ్మ (577), బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బొడ్డు నాగస్వాతి(577), మామిడి గాయత్రి (576), గురుకుల పాఠశాలకు చెందిన బద్ది జయకృష్ణ వంశీ(571), గురుకుల పాఠశాల విద్యార్థిని చీడిపల్లి వైష్ణవి(514) పురస్కారాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీలో ఇద్దరు వెనుకబడిన వర్గాల నుంచి ఇద్దరు, షెడ్యూలు కేటగిరీలో ఒకరు, షెడ్యూలు తెగలు నుంచి ఒకరు పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 వేలతోపాటు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తుందన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళాలు



వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా పలువురు దాతలు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. కశింకోట మండలం గొబ్బూరుకు చెందిన మళ్ల యశ్వంత్, మౌనిక దంపతులు రూ.10 వేలు, మునగపాకకు చెందిన మద్దాల అప్పలనాయుడు, జయపద్మ దంపతుల కుమారులు తరుణ్, మురళి రూ.6,116 విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట శ్రీనివాసరావు, విల్లూరి మోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిడుగు కాదు.. విద్యుదాఘాతం.!



విద్యుదాఘాతానికి గురై కాలిపోతున్న కొబ్బరి చెట్టు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్(ఎన్‌టీఎస్) దగ్గరలో విద్యుదాఘాతంతో ఓ కొబ్బరిచెట్టు దగ్ధమైంది. ఆదివారం రాత్రి వీచిన గాలులకు విద్యుత్ తీగలు కలిసిపోయి పక్కనున్న కొబ్బరిచెట్టుకు తగిలాయి. షార్ట్ సర్క్యూట్‌తో కొబ్బరి చెట్టుపై మంటలు వ్యాపించాయి. పిడుగు పడ్డ విధంగా చెట్టంతా కాలిపోయింది. పాఠశాల దగ్గరలో విద్యుత్ వైర్లు వేలాడుతూ మంటలు వ్యాపిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో వడ్డాది జంక్షన్‌లోనే నివాసం ఉంటున్న ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థి ఇంటిపై ఆడుకుంటూ వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందాడు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను మార్పు చేసి ప్రమాదాలు నివారించాలని పలువురు కోరుతున్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది భక్తులు శనివారం పట్టణంలో వారి స్వగృహాలు వద్ద అమ్మవారి పాట నిర్వహించి, ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. మరికొంత మంది భక్తులు ఆలయం వద్ద చలువ పందిళ్ల నీడలో వంటలు చేసుకుని నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వెంపలి రాంబాబు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఉచిత మజ్జిగ, అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



మండల టాపర్ రమాగాయత్రికి ప్రోత్సాహకం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

చోడవరం: బ్రాహ్మణుల సంక్షేమానికి గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఎంతగానో కృషి చేస్తుందని సంఘం అధ్యక్షుడు పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. చోడవరంలో సంఘ సర్వసభ్య సమావేశం సేవా ట్రస్టు గౌరవ అధ్యక్షుడు కందర్ప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ముందుగా గతేడాది బడ్జెట్‌లో జమా ఖర్చులు, ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్‌ను సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన ఆత్రేయపురపు రమా గాయత్రిని, చుండూరు వంశీకృష్ణకి రూ.5వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహంతో ఘనంగా సత్కరించారు. రెండో స్థానంలో నిలిచిన పేరి ప్రహర్షితకు రూ.3వేలు అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వింజమూరి శంకర్, ప్రతినిధులు గోటేటి సీతారామయ్య, వారణాసి రామలింగశాస్త్రి, గుంటూరు సత్యనారాయణ, కందర్ప సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో ఒకటో తగరతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు ఒకటి నుంచి పదో తరగతి వరకూ ఉచితంగా విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. 35 సంవత్సరాలుగా ఆహ్లాదకర వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని వసతి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9989719158, 7032054123 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇసుక తోడేళ్లు..!



శారదా గర్భంలో ప్రజలు రాకపోకలు సాగించే బాటను ఆనుకొని తవ్విన ప్రమాదకర గొయ్యిలు

దేవరాపల్లి: మండలంలో ఇసుక మాఫియా బరితెగించింది. ఉచిత ఇసుక పథకాన్ని ఆసరాగా చేసుకుని శారదానదిలో అడ్డుఅదుపూ లేకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా విస్తరించి ఉన్న శారదానదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక సంపదను దోచేస్తున్నారు. తిమిరాంలో ఇసుకాసురులు మరింత రెచ్చిపోతున్నారు. తిమిరాం శివాలయానికి ఎదురుగా ఉన్న శారదానదిలో సుమారు 20 నుంచి 25 అడుగుల మేర లోతున భారీ గొయ్యిలు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. నదీ తీరంలో ప్రతి శుక్రవారం జరిగే వారపు సంతకు వందల సంఖ్యలో ప్రజలు, రైతులు, వ్యాపారులు తరలివస్తారు. తిమిరాం నుంచి మామిడిపల్లికి నీటి ప్రవాహం లేనప్పుడు శారదానది మీదుగా రాకపోకలు సాగిస్తారు. అయితే ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా భారీ గొయ్యిలు తవ్వేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు, రైతులు భయాందోళనలు చెందుతున్నారు. దీంతో పాటు శివాలయంకు ఎదురుగా ఉన్న జిరాయితీ భూములకు సమీపంలోని శారదానదిలో భారీ గోతులు తవ్వడంతో నది ప్రవాహ ఉధృతికి తమ పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రజకులు బట్టలు ఉతికే ప్రాంతంలో సైతం విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. దూరంగా తవ్వాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ గోతిలో పడి ఓ యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన గతంలో చోటు చేసుకుంది.

ఈ నేపథ్యంలో మళ్లీ అదే ప్రాంతంలో కాలిబాటకు ఆనుకుని భారీ గొయ్యిలు ఏర్పాటు చేసి ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో ఇటు తిమిరాం, అటు మామిడిపల్లి ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవితంలో యోగా భాగం కావాలి



మాట్లాడుతున్న జిల్లా ఆయుష్ విభాగం అధికారి లావణ్య



యోగాసనాలు చేస్తున్న వృద్ధులు

అనకాపల్లి: ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని జిల్లా ఆయుష్ విభాగం అధికారి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జార్జ్ క్లబ్‌లో యోగాసనాలు నిర్వహించారు. యోగా గురువులు మంగియ్య, దొరమ్మ నాయుడు, బీ అప్పారావు వృద్ధులతో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చన్నారు. వృద్ధులు యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యవంతంగా జీవిస్తారన్నారు. వయోవృద్ధుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మాట్లాడుతూ ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నెల రోజులు పాటు యోగా దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కరోనా తర్వాత ప్రతి ఒక్కరిలోను యోగాపై ఆసక్తి పెరిగిందన్నారు. కార్యక్రమంలో పి.వీరభద్రరావు, జి.భీమేశ్వరరావు, కె.జగన్నాథరావు, నల్లాల దేముళ్లు, ఎం.ప్రభాకర్, బొట్టా అప్పారావు, బుద్ద వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక



విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అనకాపల్లి: విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడిగా పొన్నాడ వెంకట సత్య నర్సింహాచారి(పెదబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా యండపల్లి మోహన్ బ్రహ్మజీ, కోశాధికారిగా కిల్లాడ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులుగా బెన్నాబత్తుల వెంకటరావు, కోసూరి మన్మథరావు, కొమ్మోజు రామకృష్ణ, కాకినాడ శ్రీనుతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గోడి నర్సింహాచారి నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పెదబాబు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి సహాయ సహకారాలు పూర్తిగా అందిస్తానన్నారు. ఏటా మాదిరిగానే అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రాష్ట్ర బంగారు వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల రాజేంద్ర, మాజీ కార్పొరేటర్ బోదులపాటి ఉమామహేశ్వరరావు, పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు వెదురుపర్తి సుందరయ్య (బాబి), పట్టణ కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు కోరుకొండ వెంకట్రావు, పట్టణ విశ్వబ్రాహ్మణ మాజీ కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం



కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో తదితరులు

సింహాచలం: సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపై శ్రీ నరసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో ఈ హోమాన్ని నిర్వహించారు. హోమంలో 22 మంది ఉభయదాతలు ప్రత్యక్షంగా, 87 మంది ఉభయ దాతలు పరోక్షంగా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. ఉత్తరరాజ గోపురం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. హోమగుండం వద్ద విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.